సాక్షి విశాఖపట్నం

గురువారం । 31 । ఆగస్టు । 2023



ప్రకృతివనంలో రాఖీ పుష్పాలు

పెదవాల్తేరులోని జీవ వైవిధ్య ఉద్యానవనంలో రాఖీ పుష్పాలు విరబూశాయి. చూపరులను కనువిందు చేస్తున్నాయి. 8లో



నేడు నృసింహ యజ్ఞం

ఇస్కాన్ టెంపుల్‌లో గురువారం వరాహ నృసింహ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ తెలిపారు.

స్కేటింగ్‌లో మోక్షజ్ఞ సత్తా



బ్రిస్బేన్‌లో జరిగిన వరల్డ్ స్కేట్ ఓషియానియా చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన నగిరెడ్డి మోక్షజ్ఞ నారాయణ నాలుగు పసిడి పతకాలు సాధించి ప్రపంచ స్కేటింగ్‌లో సత్తా చాటాడు. 8లో

న్యూస్‌రీల్

రేపటి నుంచి ఆధార్ అప్‌డేట్ శిబిరాలు

నాలుగో తేదీ వరకు అవకాశం



మహారాణిపేట: ఆధార్ అప్‌డేట్ కోసం సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 4వ తేదీ వరకు నగరంలో మూడు ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. 10 ఏళ్లు పూర్తి కావడంతో ప్రతి ఒక్కరూ ఆధార్‌ను అప్‌డేట్ చేయాలని, ప్రత్యేక శిబిరా లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు కొనసాగుతాయని వెల్లడించా రు. అప్‌డేట్ కోసం సంబంధిత డాక్యుమెంట్లు సమర్పించాలని సూచించారు. చిరునామా మా ర్పులకు కూడా ధ్రువీకరణపత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు.

ప్రత్యేక శిబిరాలు ఇక్కడే..

- చినవాల్తేరు సచివాలయం(వెలగపూడి భవన్, పాత సీబీఐ ఆఫీస్ కాంపౌండ్ డౌన్)
- పెదవాల్తేరు సచివాలయం(బ్రాహ్మణ వీధి, శివాజీ పార్కు ఎదురుగా రోడ్డు)
- శివాజీపాలెం సచివాలయం(జీవీఎంసీ కమ్యూనిటీ హాలు, బలరామ్‌నగర్)

ర(వృ)క్షా బంధన్



భారీ రాఖీ ఆకృతిలో క్వీన్ మేరీ స్కూల్ విద్యార్థినులు(ఇన్‌సెట్) ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి రాఖీ కడుతున్న విద్యార్థిని



వేప చెట్టుకు రాఖీ కట్టి మాట్లాడుతున్న మేయర్ హరివెంకటకుమారి

జగదాంబ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై తమకున్న ప్రేమను చాటుకోవడానికి జీవీఎంసీ 39వ వార్డులోని క్వీన్ మేరీ స్కూల్ విద్యార్థినులు రక్షాబంధన్ పండగను వేదికగా చేసుకున్నారు. తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తూ.. రాష్ట్రానికి రక్షణగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి రాఖీ కట్టి.. కృతజ్ఞత చూపారు. అంతకుముందు రాఖీ ఆకారంలో వినూత్న రీతిలో ప్రదర్శన చేపట్టి ఆకట్టుకున్నారు.

డాబాగార్డెన్స్: రాఖీ పండగ పురస్కరించుకుని జీవీఎంసీ ప్రధాన కార్యాలయం గార్డెన్‌లోని వేపచెట్టుకు బుధవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి రాఖీ కట్టారు. మనిషికి, చెట్టుకు ఉన్న బంధాన్ని తెలియజేసేందుకు దేశీయ విత్తనాలతో తయారు చేసిన రాఖీని చెట్టుకు కట్టినట్లు చెప్పారు. చెట్లను కూడా కుటుంబ సభ్యుల్లా సాకాలని పిలుపునిచ్చారు. జీవీఎంసీ అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, డీడీహెచ్ దామోదరరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, డీసీ(ఆర్) ఫణిరామ్ తదితరులు పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్షలకు 512 మంది హాజరు



పరుగు తీస్తున్న మహిళా అభ్యర్థులు

ఆరిలోవ: ఎస్‌ఐ మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. విశాలాక్షినగర్ ప్రాంతం కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో అభ్యర్థులకు ఎస్‌ఐ దేహదారుఢ్య పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మహిళా అభ్యర్థులకు నాలుగు రోజులపాటు జరగనున్న పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 5 గంటలకే అభ్యర్థులు హాల్ టికెట్లు, సర్టిఫికెట్లతో మైదానం వద్దకు హాజరయ్యారు. రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ పర్యవేక్షణలో, విజయనగరం ఎస్పీ దీపికాపాటిల్ సమక్షంలో పోలీస్ అధికారులు సర్టిఫికెట్లు పరిశీలించారు. అనంతరం ఎత్తు, బరువు తదితర పరీక్షలు జరిపారు. ఇందులో ఎంపికైన వారికి 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు పోటీలు నిర్వహించారు. వాటిలో ప్రతిభ కనబరిచిన వారికి లాంగ్ జంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ హరికృష్ణ మాట్లాడుతూ 2,745 మంది మహిళా అభ్యర్థులకు నాలుగు రోజులపాటు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మొదటి రోజు 685 మందికి హాల్ టికెట్లు పంపగా.. 512 మంది హాజరయ్యారన్నారు. అవకతవకలకు తావు లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు.

14 వాహనాలపై కేసులు



రికార్డులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: అధిక లోడుతో వెళ్తున్న వాహనాల్లో రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల పాటు చేపట్టిన తనిఖీల్లో నిబంధనలు పాటించని 14 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు ఉప రవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. తనిఖీల్లో ఎంవీఐలు కె.ప్రవీణ్, కె.శ్రీనివాస్, మన్మోహన్, ఆర్.సుధీర్, జి.సత్యం నాయుడు, రోఖిమున్నీషా, ఏఎంవీఐలు శిరీష, దేవి, లలిత, సృజన, శ్రీనివాస్, ఎం.ఎస్.వి.ప్రకాశ్ పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో సెప్టెంబర్ ఒకటో తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. ఐఐఎఫ్ఎల్, ఆర్‌బీఎల్ బ్యాంక్, ఆధాష్ సొల్యూషన్స్, ఎంఎస్ మెరైన్ సర్వీసెస్, ట్రీనిటిక్ ఇన్ఫ్రా ఇండియా, టీం లీజ్, బయోఫోర్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, మేధా సర్వో డ్రైవ్, రిలయన్స్ డిజిటల్ తదితర కంపెనీల్లో 640 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, ఐటీఐ, బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణులైన మహిళా, పురుష అభ్యర్థులు అర్హులు. వయసు 18–45ఏళ్ల మధ్య ఉండాలి. ఆయా ఉద్యోగాలను బట్టి జీతం నెలకు రూ.12,500 నుంచి రూ40,000 వరకు ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు https://www.ncs.gov.in/ లో పేర్లు నమోదు చేసుకుని.. శుక్రవారం జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని వారు కోరారు.

నేడే ఆఖరి రోజు

- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఫీడ్‌బ్యాక్ ఇచ్చేందుకు చివరి అవకాశం
- బుధవారం నాటికి మొదటిస్థానంలో విశాఖపట్నం
- 6,52,476 మంది నగర వాసుల అభిప్రాయాల నమోదు
- 5,80,959 మందితో రెండో స్థానంలో ఇండోర్



డాబాగార్డెన్స్: స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో జీవీఎంసీ దూకుడు కొనసాగుతోంది. సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌లో ప్రస్తుతానికి దేశంలో విశాఖపట్నం మొదటిస్థానంలో ఉంది. ప్రజలు తమ ఫీడ్‌బ్యాక్ ఇచ్చేందుకు నేడే ఆఖరి రోజు. నగర ప్రజలు స్పందించి తమ అభిప్రాయాలను గురువారంలోగా తెలియజేయాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. వాస్తవానికి సిటిజన్ ఫీడ్‌బ్యాక్ నమోదుకు ఈ నెల 16వ తేదీ తోనే గడువు ముగియగా.. ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించారు. ఈ నెల 30 మధ్యాహ్నం 3 గంటలకు వరకు విశాఖపట్నం 6,52,476 మంది ఫీడ్‌బ్యాక్‌తో తొలిస్థానంలో కొనసాగుతోంది. 5,80,959 మంది ఫీడ్‌బ్యాక్‌తో ఇండోర్ రెండో స్థానంలో ఉంది. 5,38,873 మందితో భోపాల్, 3,00,897 మందితో విజయవాడ, 2,57,166 మంది ఫీడ్‌బ్యాక్‌తో గ్వాలియర్ తర్వాత స్థానాల్లో కొనసాగుతున్నాయి.

ఫీడ్ బ్యాక్ ఇవ్వండి ఇలా..

https:// vfcity-prod.sbmurban. org, voteforyourcity2023(యాప్), స్వచ్ఛతా యాప్, voteforyourcity పోర్టల్, https:// www. mygov.in, https://sbmurban.org

ఎంపీడీవోలుగా నలుగురికి పదోన్నతి

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో నలుగురికి ఎంపీడీవోలుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో అనకాపల్లి జిల్లా నుంచి ముగ్గురు, విశాఖ జిల్లా నుంచి ఒక్కరు ఎంపీడీవోలుగా పదోన్నతి పొందారు. అనంతరం వీరిని వివిధ జిల్లాలకు బదిలీ చేస్తూ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన పరవాడ మండలం ఈవోపీఆర్‌డీ పి.పద్మజను పశ్చిమ గోదావరి జిల్లాకు, నక్కపల్లి మండలం ఈవోఆర్‌డీ పి.వెంకటనారాయణను కాకినాడ జిల్లాకు, అచ్యుతాపురం ఈవోఆర్‌డీ మంతెన రాధికను విజయనగరం జిల్లాకు కేటాయించారు. విశాఖ జిల్లాకు సంబంధించి ఆనందపురం మండల పరిషత్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావును ఎంపీడీవో పదోన్నతి కల్పిస్తూ పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ చేశారు. రాష్ట్రంలో బుధవారం కౌన్సెలింగ్ ద్వారా 70 మందికి ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించగా వీరిలో ఉమ్మడి విశాఖ నుంచి నలుగురికి అవకాశం దక్కింది. గత జూన్‌లో నిర్వహించిన పదోన్నతుల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆరుగురు ఎంపీడీవోలుగా పదోన్నతులు పొందారు. త్వరలో మరో నలుగురికి ఎంపీడీవోలుగా పదోన్నతులు లభిస్తాయని తెలుస్తోంది.

పదోన్నతుల్లో పారదర్శకత

రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా పెద్ద సంఖ్యలో అర్హులకు పదోన్నతులు దక్కడమే కాదు.. పారదర్శకత పాటించారంటూ పదోన్నతులు పొందిన వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సిఫార్సులు లేకుండా, మెరిట్ ఆధారంగా నిబంధనలకు అనుగుణంగా అర్హులకు ప్రమోషన్లు లభించాయని పేర్కొంటున్నారు. బుధవారం ఉదయం కౌన్సెలింగ్ నిర్వహించగా.. సాయంత్రానికి ఉత్తర్వులు జారీ చేశారు.

ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి

డీఆర్వో శ్రీనివాసమూర్తి

మహారాణిపేట: ఓటర్ల నమోదుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి వారం ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ దృష్టికి వచ్చిన సమస్యలను తెలియజేస్తే వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈ ఏడాది జనవరి 5 నుంచి ఈ నెల 29 నాటికి ఓటర్ల జాబితాలో 50,128 చేర్పులు, 50,185 తొలగింపులు, 20,952 మార్పులు జరిగాయని చెప్పారు. ఓటర్ల జాబితా ఇంటింటి సర్వేలో కొత్తగా నమోదు కోసం గుర్తించిన ఓటర్లు(ఫారం–6) 48,195, తీసివేయడానికి గుర్తించిన ఓటర్లు(ఫారం–7) 47,086, మార్పుల కోసం గుర్తించిన ఓటర్లు(ఫారం–8) 83,037 మంది అని వెల్లడించారు. ప్రతి వారం ఓటర్ జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపుల సమాచారాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయడంతోపాటు బీఎల్‌వో యాప్‌లో నమోదు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు గుర్తించిన అర్హులైన వారిని ఓటరు జాబితాలో చేర్చడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని డీఆర్వో కోరారు. ఆయా పార్టీల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో రాజకీయ నాయకులు కృష్ణకాంత్(వైఎస్సార్‌సీపీ), కె.గోపాల్‌రెడ్డి(టీడీపీ), లక్ష్మినారాయణ(బీజేపీ), కె.ఎం.రాజు(ఆమ్ ఆద్మీ పార్టీ), బోని కృష్ణ(బీఎస్పీ), ఎన్నికల సెల్ పర్యవేక్షకుడు సిహెచ్.వి.రమేష్ పాల్గొన్నారు.

ఊళ్లకు సరికొత్త అందాలు!

- ఆర్బీకేలు, జీఎస్‌బీలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల భవనాలు
- ఉమ్మడి విశాఖలో వేగం పుంజుకుంటున్న నిర్మాణాలు
- సెప్టెంబర్ ఆఖరుకల్లా పూర్తికి సన్నాహాలు
- వీటికి మంజూరైన నిధులు రూ.508.50 కోట్లు
- ఇప్పటివరకు వెచ్చించిన సొమ్ము రూ.251.79 కోట్లు



దేవరాపల్లి మండలం ఎ.కొత్తపల్లి గ్రామ సచివాలయం



కలిగొట్లలో ఆకట్టుకుంటున్న రైతు భరోసా కేంద్రం

సాక్షి, విశాఖపట్నం: ఊళ్లు సరికొత్త అందాలను సంతరించుకుంటున్నాయి. కొంగొత్త ప్రభుత్వ భవనాలతో శోభిల్లుతున్నాయి. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు), గ్రామ సచివాలయ భవనాలు (జీఎస్‌బీలు), వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల భవనాలు నిర్మితమవుతున్నాయి. వీటిలో ఇప్పటికే కొన్ని నిర్మాణం పూర్తి చేసుకోగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. ఇలా పునాదుల దశ దాటిన భవనాలను సెప్టెంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేయడానికి సంబంధిత శాఖాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 728 సచివాలయాలు, 701 రైతు భరోసా కేంద్రాలు, 543 వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాన్ని తలపెట్టారు. వీటిలో గ్రామ సచివాలయ భవనాలకు రూ.260.57 కోట్లు, ఆర్బీకేలకు రూ.152.91 కోట్లు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి రూ.95.02 కోట్లు వెరసి రూ.508.50 మంజూరు చేశారు. ఇప్పటివరకు గ్రామ సచివాలయ భవనాలు 402, ఆర్బీకేలు 241, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు 126 పూర్తయ్యాయి. వీటిలో 326 జీఎస్‌బీలు, 456 ఆర్బీకేలు, 414 వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు పురోగతిలో ఉన్నాయి. ఇందులో జీఎస్‌బీలకు రూ.143.41 కోట్లు, ఆర్బీకేలకు రూ.66.85 కోట్లు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలకు రూ.41.53 కోట్లు వెచ్చించారు. కాగా పురోగతిలో ఉన్న వివిధ భవనాల నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయడానికి వీటి పనులను పర్యవేక్షిస్తున్న పంచాయతీరాజ్ శాఖ అధికారులు కృషి చేస్తున్నారు. పునాదుల స్థాయి దాటిన ఈ భవనాలు సెప్టెంబర్ నెలాఖరుకల్లా శరవేగంగా పూర్తికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని విశాఖ జిల్లా పంచాయతీరాజ్ సూపరింటెండింగ్ ఇంజినీర్ డీఎస్ రవీంద్ర 'సాక్షి'కి చెప్పారు.

మారుతున్న గ్రామాల స్వరూపాలు

ఒకప్పుడు గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలో, సామాజిక భవనాలో కనిపించేవి. చాలా పంచాయతీ కార్యాలయాల్లో పట్టుమని పది మంది కూర్చోవడానికి బెంచీలే తప్ప కుర్చీలు కూడా ఉండేవి కావు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల రూపురేఖలను సమూలంగా మార్చివేస్తూ సరికొత్త పల్లెలకు నాంది పలుకుతున్నారు. ఊళ్లలో కొత్తగా నిర్మిస్తున్న ఆర్బీకేలు, గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలతో ఊళ్లు కొత్త కళను సంతరించుకుని ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ఆయా భవనాల్లో కుర్చీలు, ఫర్నీచర్‌లతో పాటు అవసరమైన అన్ని సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. గతంలో మరే ప్రభుత్వం సంకల్పించని విధంగా ఈ ప్రభుత్వం హయాంలో నిర్మితమవుతున్న ఈ భవనాలు అన్ని హంగులతో కళకళలాడుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ప్రభుత్వ లక్ష్యానికి ఎంపీహెచ్‌ఈవోల తూట్లు

- వచ్చిన చోట చేరకుండా తిరస్కరణ
- అర్బన్‌లో పోస్టింగుల కోసం పైరవీలు
- ఏజెన్సీలో ఖాళీలున్నా ఆసక్తి చూపించని వైనం

మహారాణిపేట: ప్రజలకు వైద్య సేవలు చేరువ చేయాలన్న ప్రభుత్వ సంకల్పానికి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తూట్లు పొడిచారు. ప్రతి పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్న ప్రభుత్వ ఆదేశాలను తుంగలో తొక్కారు. పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులతో పాటు 14 మంది సిబ్బంది రీఫిక్సింగ్ కార్యక్రమాన్ని నీరుగార్చారు. వివరాలివీ.. జీవో–143 ప్రకారం ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో 14 మంది సిబ్బందిని నియమించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం ఈ నెల 26న మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(ఎంపీహెచ్‌ఈవో) బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందుకోసం మొత్తం 6 జిల్లాల నుంచి 74 మందిని ఆహ్వానించారు. వీరికి ఓ వరస సంఖ్య కూడా ఇచ్చారు. ఇందులో కొంత మంది వరస సంఖ్యలో వచ్చిన నంబర్‌ను తిరస్కరించారు. నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్‌కు అంగీకరించిన ఎంపీహెచ్‌ఈవోలకు బదిలీని తిరస్కరించే అధికారం లేదు. కానీ ఇక్కడ కొంత మంది తమకు వచ్చిన పోస్టింగ్‌లను తిరస్కరించారు. దీంతో వారి తర్వాత ఉన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇలా 18 మంది తిరస్కరించిన జాబితాలో ఉన్నారు. ఈ 18 పోస్టులు ఖాళీగా ఉండే పరిస్థితులు నెలకొన్నాయి. ఏజెన్సీలో పలు పీహెచ్‌సీల్లో ఎంపీహెచ్‌ఈవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కానీ వీరు అక్కడ ఉద్యోగాలు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. నగరంలోని కేజీహెచ్, ఘోషా, విమ్స్ తదితర ఆస్పత్రుల్లో చేరేందుకు పైరవీలు చేస్తున్నారు. ఇటువంటి వారికి వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వత్తాసు పలుకుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

'15లోగా పెన్షనర్లు ఈకేవైసీ పూర్తి చేయాలి'

మహారాణిపేట: రాష్ట్ర ట్రెజరీస్, అకౌంట్స్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ పెన్షనర్ సెప్టెంబర్ 15లోగా ఈకేవైసీ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి.డి.ప్రసాదరావు కోరారు. జిల్లాలో ఇంకా 900 మంది పెన్షనర్లు ఈకేవైసీ చేసుకోవాల్సి ఉందని, ఈ కేవైసీ చేసుకోకపోతే అక్టోబర్ నుంచి పెన్షన్ నిలిచిపోతుందని ట్రెజరీ అధికారులు సమాచారం ఇచ్చారన్నారు. ఆయా ట్రెజరీ కార్యాలయాల్లో ఈకేవైసీ అందుబాటులో ఉందని, ఈ అవకాశాన్ని పెన్షనర్లంతా వినియోగించుకోవాలని సూచించారు.

చురుగ్గా యువతి మృతి కేసు విచారణ

సీతమ్మధార: హాస్టల్ పైనుంచి పడి యువతి మృతి చెందిన కేసులో వాస్తవాలు వెలికి తీసేందుకు మరింత లోతుగా ఈస్ట్ జోన్ ఏసీపీ వీఎస్ఎన్ఆర్ మూర్తి బుధవారం విచారణ చేపట్టారు. పశ్చిమ బెంగాల్‌కి చెందిన రితి సాహా బైజూస్, ఆకాష్ శిక్షణ కేంద్రం అచీవర్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతూ సాధన హాస్టల్‌లో ఉంటూ ఈ ఏడాది జూలై 14 మృతి చెందిన విషయం తెలిసిందే. హాస్టల్ భవనం టెర్రస్ పైనుంచి కిందకు పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో ఫోర్తు టౌన్ పోలీస్ స్టేషన్‌లో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఇప్పటి వరకూ ఈ కేసును ఎస్‌ఐ స్థాయి అధికారి దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో మృతిపై అనుమానాలున్నాయని మృతురాలి బంధువులు ఉన్నతాధికారులను సంప్రదించడంతో ఈస్ట్ ఏసీపీ మూర్తిని విచారణ అధికారిగా సీపీ త్రివిక్రమ్ వర్మ నియమించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన బైజూస్, ఆకాష్ సంస్థ నిర్వాహకులు, సాధన హాస్టల్ యాజమాన్యం, వైద్యుల పాత్రపై దర్యాప్తు చేశారు. సాక్షులను మరోసారి విచారించిన ఆయన కేసును ఐపీసీ సెక్షన్ 304 పార్ట్ టూగా మార్పు చేశారు. విజయవాడ నుంచి ఫోరెన్సిక్ లేబొరేటరీ రిపోర్టు వస్తే పరిశీలించి సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రేమ సమాజంలో పెళ్లి బాజా

చార్టెడ్ అకౌంటెంట్‌తో ప్రేమ సమాజం అమ్మాయికి వివాహం



వధూవరులను ఆశీర్వదిస్తున్న పెద్దలు

డాబాగార్డెన్స్: వేద మంత్రాలు.. పచ్చని తోరణాలు.. బాజా భజంత్రీలు.. మంగళ వాయిద్యాలు.. దాతల దీవెనలు.. విందు భోజనాలు.. కల్యాణ కాంతులతో ప్రేమసమాజం కళకళలాడింది. పెద్దల దీవెనలతో ప్రేమసమాజం అమ్మాయికి, చార్టెర్డ్ అకౌంటెంట్‌తో పెళ్లి జరిగింది. అందుకు ప్రేమ సమాజంలోని అన్నపూర్ణ ఆడిటోరియం వేదికైంది. కన్యాదాతలుగా ప్రముఖులు వ్యవహరించడంతో అమ్మాయికి అమ్మానాన్న లేరన్న అభిప్రాయానికి తావే లేకుండా పోయింది. చిన్నప్పుడే తండ్రిని కోల్పోయి ప్రేమ సమాజం అనాథ బాలబాలికల ఆశ్రమంలో ఆశ్రయం పొందిన మేఘనకు తల్లి పెళ్లి సంబంధం నిశ్చయించారు. ఆరిలోవ బాలాజీనగర్‌కు చెందిన నూజివీడు చార్టెర్డ్ అకౌంటెంట్ కాలేజీలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న అనంత్‌కుమార్ శర్మతో అందరి సమక్షంలో బుధవారం ఉదయం 10.55 గంటలకు ఈ వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రేమసమాజం ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ ప్రాదేశిక్ మార్వారీ సమ్మేళన్ కమిటీ, పలువురు ప్రముఖులు ఈ వివాహానికి హాజరై నూతన దంపతులను దీవించారు. దాతలు ముందుకొచ్చి ఆ నూతన దంపతులకు కట్నకానుకలు అందజేశారు. ప్రేమసమాజంలో రెండు దశాబ్దాలుగా ఆశ్రయం పొందిన మేఘన తమ సొంత అమ్మాయి అన్న తీరున ఎక్కడెక్కడి వారో కానుకలు అందించారు. ప్రేమసమాజం కార్యవర్గం అనుమతితో కంచర్ల అన్నపూర్ణ ఏసీ ఆడిటోరియంలో వివాహం జరిపేందుకు అనుమతి ఇవ్వగా... అతిథులకు మధ్యాహ్న విందు, పెళ్లి ఖర్చును ప్రేమసమాజం చూసుకుంది. కార్యవర్గ సభ్యులు గ్రంధి మల్లికా మనోజ్ జత బంగారు వస్తువులు, డాక్టర్ పి.విశ్వేశ్వరరావు రూ.10వేలు, గ్రంధి రాజేష్ రూ.10వేలు, పలువురు పెద్దలు ఇచ్చిన మొత్తం రూ.61వేలను మేఘన పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను వివాహ కానుకగా అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రాదేశిక్ మార్వారీ సమ్మేళన్ కమిటీ తరఫున అధ్యక్షుడు చాంద్‌మాల్ అగర్వాల్, కార్యదర్శి పోడేశ్వర్ పురోహిత్ తదితరులు బంగారు తాడు, వెండి పట్టీలు, వెండి మట్టెలు, బంగారు ముక్కుపుడక, రెండు వాచీలు, వధూవరులకు నూతన వస్త్రాలు, కానుకలు అందజేశారు. ప్రేమసమాజంలో ఇది 111వ వివాహం. ప్రేమసమాజం అధ్యక్షుడు బుద్ద శివాజీ, ఉపాధ్యక్షులు మట్టపల్లి హనుమంతరావు, కె నర్సింహమూర్తి, కార్యదర్శి హరిమోహన్‌రావు, సలహాదారుడు డాక్టర్ పి.విశ్వేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి వీకే సురేష్‌కుమార్, ఎస్.గౌరీప్రసాద్, కార్యవర్గ సభ్యులు పి.గణపతిరావు, ఉప్పల భాస్కరరావు, అప్పలరాజు తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పాలిసెట్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభం



ధ్రువీకరణపత్రాలను తనిఖీ చేస్తున్న అధ్యాపకుడు

మురళీనగర్: పాలిసెట్ రెండవ విడత కౌన్సెలింగ్ బుధవారం ప్రారంభమైంది. మొదటి దశ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 23వ తేదీలోగా చేరారు. వీరికి ఇప్పటికే తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం మిగిలిపోయిన సీట్ల భర్తీకి సంబంధించి రెండవ విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. పాలిసెట్‌లో ర్యాంకుల పొందిన విద్యార్థులు వచ్చే ఒకటో తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన చేసుకోవచ్చు. ఇప్పటివరకు పేర్లు నమోదు చేసుకోని వారు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రానికి వెళ్లి సర్టిఫికెట్లు పరిశీలన చేసుకోవచ్చు. సెప్టెంబర్ ఒకటి, రెండో తేదీల్లో వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం ఉంది. నాలుగో తేదీన సీట్లు కేటాయిస్తారు. నాలుగు నుంచి 7వ తేదీ వరకు సెల్ఫ్ రిపోర్టింగ్‌తోపాటు కాలేజీలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

నేటితో ముగియనున్న ఇంజినీరింగ్ ప్రవేశాలు

ఏపీఈఏపీసెట్‌లో సీట్లు పొందిన విద్యార్థులు వారికి కేటాయించిన ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరడానికి గురువారంతో గడువు ముగుస్తుంది. అదేరోజు నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. వీరు కేవలం అలాట్‌మెంట్ లెటర్, సెల్ఫ్ జాయినింగ్ లెటర్ ఇస్తే సరిపోతుంది. ఎటువంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని అధికారులు చెప్పారు. ఇదిలా ఉండగా ఈసెట్ కౌన్సెలింగ్ ముగిసిన నేపథ్యంలో వీరికి గురువారం సీట్లు కేటాయిస్తారు. వీరు సెప్టెంబర్ ఒకటి నుంచి నాలుగో తేదీలోగా వారికి కేటాయించిన ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. వీరికిదే చివరి కౌన్సెలింగ్ అని అధికారులు చెప్పారు.

కేజీబీవీల్లో మరో 39 పోస్టుల భర్తీకి సన్నాహాలు

- బోధనకు ఆటంకం లేకుండా ఏర్పాట్లు
- యుద్ధ ప్రాతిపదికన నియామక ప్రక్రియ
- ఇప్పటికే మెరిట్ జాబితా సిద్ధం

విశాఖ విద్య: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఉపాధ్యాయుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని కేజీబీవీల్లో వివిధ కేడర్లకు చెందిన 39 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. యుద్ధ ప్రాతిపదికన నియామక ప్రక్రియ చేపట్టాలని విద్యాశాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 151 పోస్టుల భర్తీ కోసమని ఇటీవల నోటిఫికేషన్ జారీ చేయగా, సుమారు ఐదు వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మెరిట్ కమ్ రోస్టర్ పద్ధతిన ప్రతీ ఒక్క పోస్టుకు ఐదుగురు చొప్పున అర్హుల జాబితా తయారు చేసి, అందులో టాప్‌లో ఉన్న వారితో నియామకాలు చేపట్టారు. అయితే వివిధ కారణాలతో 39 పోస్టులు ఖాళీగా ఉండిపోయాయి. వీటి కోసమని మళ్లీ కొత్త నోటిఫికేషన్ జారీ చేస్తే, నియామకాల ప్రక్రియలో జాప్యం ఏర్పడుతుందని భావించిన ప్రభుత్వం.. అప్పటి దరఖాస్తుదారుల్లో మెరిట్ ఉన్నవారికి ఉద్యోగాలు కల్పించాలని ఆదేశించింది.

బోధనకు వీలుగా చర్యలు...

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో బోధనకు ఆటంకం లేకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఇక్కడి విద్యార్థినుల చదువుల దృష్ట్యా నియామకాలకు ప్రాధాన్యమిస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రిన్సిపాల్స్ – 6, పోస్టు గ్రాడ్యుయేషన్ టీచర్ (పీజీటీ) – 22, కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ (సీఆర్టీ) – 11 పోస్టులు ఉన్నాయి. వీటిని సకాలంలో భర్తీ చేసేందుకు జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో – ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తరగతుల నిర్వహణ ప్రాధాన్యత దృష్ట్యా ఎంపికైన అభ్యర్థులు సెప్టెంబర్ 1న విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

10న నాగవంశీయుల రాష్ట్ర స్థాయి సమావేశం



మహరాజుపేటలో సమావేశమైన నాగవంశీయుల ప్రతినిధులు

తగరపువలస: ఉత్తరాంధ్రలో ప్రధాన వేదికపై సెప్టెంబర్ 10న నాగవంశీయుల రాష్ట్ర సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం స్థానిక మహరాజుపేట కూడలిలో ఉత్తరాంధ్ర నాగవంశీయుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వం నాగవంశీయులకు రాష్ట్ర కార్పొరేషన్, డైరెక్టర్లు, ఇతర పదవులు కల్పించడంపై చర్చించారు. అలాగే బీసీ బీ నుంచి బీసీ ఏ లోకి మార్చడంపై మాట్లాడారు. త్వరలో జరగనున్న ఎన్నికల సందర్భంగా సెప్టెంబరు 10న రాష్ట్ర స్థాయి సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడినట్టు తెలిసింది. ఈ సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన నాగవంశీయులు బొడ్డు అప్పలనాయుడు, కంటుభుక్త రామానాయుడు, చిలకా నరసింగరావు, నల్లి రవి, గాడు వెంకటనారాయణ, గాడు తాతినాయుడు, నామాల తిరుపతిరావు, ఎర్నింటి వెంకటరావుతోపాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

లాజిస్టిక్స్ వ్యయం తగ్గించేందుకు చర్యలు

- ఎంపీ జీవీఎల్‌ను కోరిన అసోసియేషన్ల సభ్యులు



అసోసియేషన్ల సభ్యులతో జీవీఎల్ నరసింహారావు

బీచ్‌రోడ్డు: లాజిస్టిక్స్ వ్యయాన్ని తగ్గించేందుకు పోర్టును మరింత అభివృద్ధి చేయాలని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు ఎంపీ జీవీఎల్ నరసింహారావును స్టీమ్‌షిప్ ఏజెంట్స్ అసోసియేషన్, కస్టమ్స్ బ్రోకర్స్ అసోసియేషన్, స్టీవ్‌డోర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. సిరిపురంలోని దత్త ఐలాండ్‌లో గల వీసీసీఐ కార్యాలయంలో పలు అసోసియేషన్స్‌తో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను జీవీఎల్ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా బల్క్ స్టోరేజ్ ఫెసిలిటీ కోసం కవర్డ్ స్టోరేజ్ వీపీఏ చేపట్టాలన్నారు. నేషనల్ లాజిస్టిక్స్ పాలసీకి అనుగుణంగా 24/7 పోర్ట్ కనెక్టివిటీ ఉండాలన్నారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించే విధంగా పలు రోడ్డు మార్గాలను పూర్తి చేయాలని కోరారు. అసోసియేషన్స్ సమస్యలను విన్న జీవీఎల్ వాటిని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మేరా మాటీ, మేరా దేశ్‌లో భాగస్వాములుకండి

ఎంవీపీ కాలనీ: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మేరా మాటీ, మేరా దేశ్ కార్యక్రమంలో దేశంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీ జీవీఎల్ నరసింహారావు పిలుపునిచ్చారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశాన్ని 2047 నాటికి ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా నిలిపే కార్యక్రమంలో ప్రజలంతా భాగం కావాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1 నుంచి 15 వరకు ఐక్యతాభావం పెంచే విధంగా నా మట్టి, నా దేశం పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో యువత భాగస్వాములు కావాలని కోరారు. పార్టీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహం నడుపుతున్న ఇల్లు సీజ్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు సంతోషినగర్‌లో ఒక ఇంటిని గోపాలపట్నం రెవెన్యూ అధికారులు, పోలీసులు బుధవారం సీజ్ చేశారు. ఇటీవల ఈ ఇంటిలో వ్యభిచారం చేస్తుండగా గోపాలపట్నం పోలీసులు దాడి చేసి పలువురిని పట్టుకుని కేసు నమోదు చేశారు. అనంతరం విచారణ చేపట్టి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ ఇంటిని సీజ్ చేశారు.






ప్రకృతివనంలో రాఖీ పుష్పాలు

ఏయూ క్యాంపస్ : స్థానిక పెదవాల్తేరులోని జీవ వైవిధ్య ఉద్యానవనంలో రాఖీ పుష్పాలు విరబూశాయి. పాసీఫ్లోరా జాతికి చెందిన తీగజాతి మొక్కలు రాఖీలను పోలిన రంగురంగుల పుష్పాలతో కనువిందు చేస్తున్నాయి. నాలుగైదు రకాలతో విభిన్న డిజైన్లతో ఈ పుష్పాలు ఆకట్టుకుంటున్నాయి. జీవవైవిధ్య ఉద్యానవనాన్ని ఎంవీపీ కాలనీలోని బాష్యం పాఠశాల చిన్నారులు బుధవారం సందర్శించారు. పార్క్‌లో వివిధ జాతుల మొక్కలు, పుష్పాలను వీరు అసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా రాఖీ పుష్పాలను చూసి ఆనందం వ్యక్తం చేశారు.

యువకుడి ఆత్మహత్య

పెదగంట్యాడ : మండలంలోని ఓ లాడ్జిలో యువకుడు బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూపోర్టు ఎస్ఐ మన్మథరావు తెలిపిన వివరాల ప్రకారం... దల్లివీధికి చెందిన గొందేశి తేజరెడ్డి (24) స్థానిక ఎస్ఎం లాడ్జిలో రిసెప్షనిస్ట్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం 10.30 గంటల వరకూ అందరితో సరదాగా గడిపిన ఆ యువకుడు మధ్యాహ్నం 12 గంటల సమయంలో అదే లాడ్జిలోని 102 రూమ్‌లో బెడ్‌షీట్‌తో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి, అక్క గతంలో మృతి చెందగా తల్లి జ్యోతితో కలిసి నివసిస్తున్నాడు. మృతుని తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు న్యూపోర్టు సీఐ రాము ఆధ్వర్యంలో ఎస్ఐ మన్మథరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జులాయికి ఏడాది జైలు

విశాఖ లీగల్ : మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడికి ఏడాది జైలు, రూ.2వేలు జరిమానా విధిస్తూ నగరంలోని ఒకటో అదనపు ప్రధాన మెట్రోపాలిటీ మేజిస్ట్రేట్ సీహెచ్ యుగంధర్ బుధవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు దుప్పాడ రాంబాబు (30) నగరంలోని కలెక్టర్ కార్యాలయం దగ్గర ఉన్న అఫీషియల్ కాలనీ నివాసి. ఒక ప్రైవేట్ షిప్పింగ్ కంపెనీలో ఉద్యోగి. బాధితురాలు బీచ్ రోడ్‌లోని ఒక అలంకరణ విభాగంలో పనిచేసేది. ఈ నేపథ్యంలో 2020 జూలై 31 నుంచి బాధితురాలు హోటల్‌కి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు రాంబాబు ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. తన బైక్‌పై వచ్చి ఇబ్బంది పెడుతూ పారిపోయేవాడు. 2020 జులై 31న సాయంత్రం బాధితురాలు వస్తుండగా బీచ్ రోడ్‌లో ఆమెను వెంబడించి, ఇబ్బంది పెట్టి పారిపోయాడు. అనంతరం బాధితురాలు కొంతమంది సహకారంతో దిశ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి పోలీసు ఉప కమిషనర్ ప్రేమ్ కాజల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

కారు ఢీకొని హోంగార్డుకు గాయాలు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీవారి ఆలయం వద్ద విధులు నిర్వహిస్తున్న హోంగార్డు మైలపు రాంబాబు బుధవారం రాత్రి విధులు ముగించుకుని తన గ్రామమైన రాజులతాళ్లవలసకు బైక్‌పై వెళ్తుండగా మార్గ మధ్యలో ఉప్పాడ వద్ద వెనుక నుంచి ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాంబాబుకు, వెనుక కూర్చున్న మరో వ్యక్తికి గాయాలైనట్లు సీఐ రమేష్ తెలిపారు. ప్రస్తుతం వీరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

హామీలు నెరవేర్చలేనప్పుడు ఎందుకొచ్చారు..?

- టీడీపీ కార్పొరేటర్‌ను నిలదీసిన మహిళ



కార్పొరేటర్ శరగడం రాజశేఖర్‌ను నిలదీస్తున్న నల్లమ్మ

కంచరపాలెం (విశాఖ ఉత్తర): గతంలో కార్పొరేషన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేనప్పుడు మా ప్రాంతానికి ఎందుకు వచ్చారంటూ జీవీఎంసీ 56వ వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ (టీడీపీ)ను స్థానిక మహిళ నిలదీశారు. కంచరపాలెం పరిధి దయానందనగర్ చాకలిగెడ్డలో కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ (టీడీపీ) బుధవారం మహాశక్తి కార్యక్రమం, టీడీపీ మేనిఫెస్టో ప్రచారానికి వెళ్లారు. ఈ క్రమంలో ఆయనపై స్థానిక మహిళ నల్లమ్మ మండిపడ్డారు. కార్పొరేషన్ ఎన్నికల సమయంలో కనిపించిన రాజశేఖర్... ఇన్నాళ్లకు మళ్లీ వచ్చారా అని విరుచుకుపడింది. వార్డు ప్రజలను, వారి సమస్యలను పట్టించుకోని నాయకుడు ప్రచారానికి ఎందుకు వచ్చారంటూ నిలదీసింది. ఎప్పుడో ఓట్లు కోసం వచ్చి... మళ్లీ ఇప్పుడు నలుగురు మహిళలను వెంటేసుకొచ్చారని నిలదీసింది. దయానందనగర్, చాకలిగెడ్డ, ముత్యమాంబకాలనీ, రాజీవ్‌కాలనీల్లో టిడ్కో ఇళ్లల్లో టీడీపీ నాయకులు అవకతవకలకు పాల్పడ్డారని ఆమె ఆరోపించారు. కార్పొరేటర్, టీడీపీ నాయకులు మా కాలనీలోకి రావద్దు అంటూ నిలదీసిన నల్లమ్మకు స్థానికులు మద్దతు పలికారు. సమాధానం చెప్పలేక అక్కడి నుంచి కార్పొరేటర్ రాజశేఖర్ ప్రచార రథం ఎక్కి వెళ్లిపోయాడు. కార్పొరేటర్ రాజశేఖర్‌ను నల్లమ్మ నిలదీసిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో వార్డు ప్రజలు కార్పొరేటర్‌పై మరింత మండిపడుతున్నారు.

సెల్‌ఫోన్ దొంగకు జైలు శిక్ష

గోపాలపట్నం: ఒక వ్యక్తిపై దాడి చేసి సెల్‌ఫోన్ అపహరించిన కేసులో ముద్దాయి బట్టా హేమంత్‌కు విశాఖపట్నం 2వ ఏసీఎంఎం కోర్టు జడ్జి కేవీఎల్ హిమబిందు ఏడాది జైలు శిక్ష విధించారు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గోపాలపట్నం ప్రాంతంలో 2019లో ఒక వ్యక్తిపై బట్టా హేమంత్ దాడి చేసి ఫోన్ దొంగలించాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి హేమంత్‌ను అప్పట్లో అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో విచారణ పూర్తవడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

స్కేటింగ్‌లో మోక్షజ్ఞ సత్తా

బీచ్‌రోడ్డు: ఆస్ట్రేలియా దేశంలోని బ్రిస్బేన్‌లో జరిగిన వరల్డ్ స్కేట్ ఓషియానియా చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన నగిరెడ్డి మోక్షజ్ఞ నారాయణ నాలుగు పసిడి పతకాలు సాధించి ప్రపంచ స్కేటింగ్‌లో సత్తా చాటాడు. 9 ఏళ్ల వయస్సు గల మోక్షజ్ఞ ఫ్రీస్టైల్, సోలో డ్యాన్స్, ఫీగర్ స్కేటింగ్, ఇన్‌లైన్ స్కేటింగ్ విభాగాల్లో పసిడి పతకాలు సాధించాడు. శివాజీ పార్క్‌లోని చిట్టిబాబు, సత్యనారాయణ సారథ్యంలో శిక్షణ తీసుకుంటున్న మోక్షజ్ఞ ఇప్పటి వరకు నాలుగు అంతర్జాతీయ, ఆరు జాతీయ, పది రాష్ట్ర స్థాయి పసిడి పతకాలను సాధించాడు.

మెడికవర్ ఆస్పత్రిలో శిశువు మృతి

మహారాణిపేట: జగదాంబ జంక్షన్‌లో ఉన్న మెడికవర్ ఆస్పత్రిలో 16 రోజుల మగ శిశువు చనిపోయాడు. ఈ నెల 15న అనకాపల్లి జిల్లా పాపయ్య సంతపాలెం గ్రామానికి చెందిన తలారి గణేష్, సాయి దంపతులకు మగశిశువు జన్మించాడు. నెలలు నిండకుండానే ఏడో నెలలో శిశువు జన్మించాడు. ఈ క్రమంలో బరువు తక్కువగా వుండడంతో మెరుగైన చికిత్స కోసం తల్లిదండ్రులు మెడికవర్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ నేపథ్యంలో హార్ట్‌లో హోల్ ఉండడం వల్ల శిశువుకు డాక్టర్ సునీల్ శస్త్ర చికిత్స చేసి పర్యవేక్షించారు. శిశువును ఆస్పత్రిలో చేర్పించి బుధవారం నాటికి 16 రోజులయ్యాయి. బుధవారం ఉదయం శిశువు ఆరోగ్య పరిస్థితి ఏమి బాగాలేదని, వెంటిలేటర్ మీద చికిత్స అందిస్తున్నట్టు డాక్టర్ సునీల్ ఆస్పత్రి నుంచి ఫోన్ చేసి తల్లిదండ్రులకు చెప్పారు. కొద్ది సేపటి తర్వాత శిశువు చనిపోయాడని, ఇంకా రూ.4.4 లక్షలు చెల్లించాలని తల్లిదండ్రులకు ఆస్పత్రి సిబ్బంది చెప్పారు. దీంతో ఆందోళన చెందిన గణేష్, సాయి అంత డబ్బులు తాము చెల్లించలేమని, ఇప్పటికే రూ.3 లక్షలకు పైగా చెల్లించామని ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. చివరకు ఆస్పత్రి యాజమాన్యంతో చర్చించి చనిపోయిన శిశువును తీసుకొని ఇంటికి వెళ్లిపోయారు.

మందుబాబులకు కమ్యూనిటీ సర్వీస్ శిక్ష

తగరపువలస: విశాఖ నగర పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 113 మందికి రూ.వెయ్యి నుంచి రూ.11వేలు జరిమానా, 66 మందికి భీమిలి సెయింట్ ఆన్స్ స్కూల్ ఆవరణలో గంట సమయంపాటు కమ్యూనిటీ సర్వీస్ శిక్షను బుధవారం ఆయా న్యాయస్థానాలు విధించాయి. మహారాణిపేట, ఫోర్ట్ టౌన్, ద్వారక, పీఎం పాలెం, ఆనందపురం, భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో వీరంతా పట్టుబడ్డారు.